క్లుప్తంగా

ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలి

అమలాపురం టౌన్: ప్రతి ఆస్పత్రి స్వచ్ఛ ఆస్పత్రిగా ఉండాలని, ఆస్పత్రుల్లో పరిశుభ్రతే రోగులకు ఆరోగ్య భద్రతనిస్తుందని ఉభయ తెలుగు రాష్ట్రాల ల్యాబ్ ఐ క్యూ వైస్ ప్రెసిడెంట్ హరి కాశి పేర్కొన్నారు. అమలాపురం సమీపంలోని వై జంక్షన్‌లో గల సాయి విశ్వాస్ ఆస్పత్రి, ఐ క్యూ ల్యాబ్ సంయుక్తంగా ఆ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ల అవగాహన, శిక్షణ సదస్సులో హరి కాశి మాట్లాడారు. సాయి విశ్వాస్ ఆస్పత్రి చైర్మన్ గంధం విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ కార్యక్రమంలో ల్యాబ్ ఐ క్యూ వైద్యులు పలు సూచనలు చేశారు.శుభ్రత, లేబరింగ్, సురక్షిత రవాణా, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వర్గీకరణపై ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. హెడ్ ఆఫ్ మొలెక్యూలర్ డయాగ్నోస్టిక్స్ వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

యానాం: పుదుచ్చేరి డైరక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి ఆదివారం నిర్వహించిన బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో సెంటాక్ ప్రభుత్వ కోటా అడ్మిషన్లకు నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో మొత్తం 2,212 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకుంటే వీరిలో 1,876 మంది హాజరయ్యారు. యానాంలో రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో పరీక్ష నిర్వహించగా మొత్తం 54 మందికి 43 మంది హాజరుకాగా 11 గైర్హాజరయ్యారు. సూపర్‌వైజర్ పుదుచ్చేరి విద్యుత్ శాఖ ఓఎస్డీ సావిత్రి, ఇన్‌చార్జి ఆర్‌ఏఓ భాస్కర రెడ్డి పర్యవేక్షించారు.

బీజేపీ అధ్యక్షుడిగా రామలింగం ఎన్నిక ఏకగ్రీవం



నామినేషన్ దాఖలు చేస్తున్న రామలింగం, చిత్రంలో మంత్రి నమశ్శివాయం

యానాం: పుదుచ్చేరి భారతీయ జనతాపార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా మాజీ నామినేటెడ్ ఎమ్మెల్యే రామలింగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బీజేపీ అధ్యక్షుడికి జరిగిన ఎన్నికల్లో రామలింగం ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. అంతకుముందు బీజేపీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన ఎమ్‌కే అఖిలన్‌కు రామలింగం తన నామినేషన్ పత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామలింగం పేరును సోమవారం బీజేపీ జాతీయ జనరల్ సెక్రటరీ, ఎన్నికల ఇన్‌చార్జి తరుణ్‌చా సమక్షంలో అధికారికంగా ప్రకటించనున్నారు. మాజీ కాంగ్రెస్ నాయకుడైన రామలింగం 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయనను నామినేటెడ్ ఎమ్మెల్యేగా నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పీకర్‌గా వ్యవహరించిన ముదులియార్ సామాజిక వర్గానికి చెందిన వీపీ శివకొలిందు సోదరుడు రామలింగం. ఈ కార్యక్రమంలో హోం మంత్రి నమశ్శివాయం, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, మాజీ మంత్రి ఏకే సాయిశర్వణన్ కుమార్, బీజేపీ ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్‌సురేనా తదితరులు పాల్గొన్నారు.

విజయ దుర్గా దేవికి కుంకుమార్చన

కాట్రేనికోన: చింతలమెరకలో విజయ దుర్గాదేవికి వారాహి నవరాత్రులు సందర్భంగా మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో గణపతి పూజ, పంచామృత అభిషేకం, కుంకుమ పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

ఉప్పలగుప్తం: స్థానిక పంచాయతీ పరిధి లక్ష్మీచెరువుగట్టు ప్రాంతంలోని విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని ఆదివారం రాత్రి గ్రామస్తులు విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆర్‌డబ్ల్యూఎస్‌గా వేరు చేయడంతో గ్రామంలో అన్ని చోట్ల విద్యుత్ సరఫరా ఉన్నా లక్ష్మీచెరువుగట్టు ప్రాంతంలో బ్రేక్‌డౌన్ సాకుతో తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారని వాపోయారు. అధికారులు దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ సూర్యనారాయణ మృతికి సంతాపం

అల్లవరం: మొగల్లమూరు మాజీ సర్పంచ్ గెద్దాడ సూర్యనారాయణ (82) శిరగట్లపల్లిలోని ఆయన నివాసంలో శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సూర్యనారాయణ మృతికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రా యిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, సర్పంచ్ రాయుడు విష్ణు, ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, తదితరులు సంతాపం తెలిపారు.

తాగునీటికి తప్పని కష్టాలు

- రూ.20 కోట్ల తాగునీటి ప్రాజెక్ట్ పూర్తయితేనే దాహార్తి తీరేది
- రోజుకు కావాల్సింది 80 లక్షల లీటర్ల తాగునీరు
- 51 లక్షల లీటర్లు మాత్రమే సరఫరా
- 29 లక్షల లీటర్ల లోటు భర్తీకి చర్యలు శూన్యం
- పట్టణంలో తాగునీటికి ప్రజల ఇక్కట్లు



అమలాపురం వాటర్ వర్క్స్ విభాగం ప్రాంగణం



అమలాపురంలో ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

అమలాపురం టౌన్: ఇటీవల అమలాపురం పట్టణంలో తాగునీటి కష్టాలు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వంలో అప్పటి అమలాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ ముందు చూపుతో రానున్న 25 ఏళ్లకు తాగునీటి వనరులకు ఢోకా లేకుండా పట్టణానికి మంజూరు చేయించిన రూ.20 కోట్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ప్రస్తుత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేయడంతో నేడు తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.20 కోట్ల తాగునీటి ప్రాజెక్ట్‌లో ముఖ్యంగా మూడు భారీ ఓహెచ్‌ఆర్‌లు గాంధీనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవీఆర్ నగర్‌లో మంజూరయ్యాయి. ఇందులో భాగంగానే గాంధీనగర్ భారీ ఓహెచ్‌ఆర్ నిర్మాణం మాత్రమే పూర్తయి నేటికీ నిరుపయోగంగా ఉంది. మిగిలిన హౌసింగ్ బోర్డు కాలనీ, ఏవీఆర్ నగర్‌లో ఓహెచ్ ఆర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మంత్రి విశ్వరూప్ రూ.20 కోట్ల ప్రాజెక్ట్ తెచ్చి గాంధీనగర్ ఓహెచ్‌ఆర్ పూర్తయ్యే సరికి సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైంది. దీంతో ప్రాజెక్ట్‌పై అధికారులు దృష్టి కేంద్రీకరించలేదు. నేడు పట్టణంలో ఆ ప్రాజెక్ట్‌ను ఎవరూ పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలన్న తలంపు కానరావడం లేదు.

పెరిగిన పట్టణ జనాభా

ప్రస్తుతం అమలాపురం పట్టణ జనాభా దాదాపు 60 వేలకు చేరుకుంది. మనిషి తల ఒక్కంటికీ 135 లీటర్ల నీరు చొప్పున మొత్తం రోజుకు 80 లక్షలు లీటర్ల నీరును అందించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులు ఆ స్థాయిలో లేవు. ఇప్పుడున్న రిజర్వాయర్లు, ఓహెచ్‌ఆర్‌లు ఈ స్థాయిలో సరఫరా చేసే సామర్థ్యాన్ని కలిగి లేవు. ప్రస్తుతం మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగం రోజుకు పట్టణ ప్రజలకు 51 లక్షల లీటర్లను మాత్రమే సరఫరా చేయగలుగుతోంది. 80 లక్షల లీటర్ల నీటిని ఇవ్వాల్సిన వాటర్ వర్క్స్ విభాగం కేవలం 51 లక్షల నీరే ఇస్తూ మిగిలిన 29 లక్షల లీటర్ల నీటిని ఇవ్వలేకపోతోంది. 29 లక్షల లీటర్ల నీరు ఇవ్వలేకే పట్టణంలో తాగునీటి కష్టాలు అనివార్యమవుతున్నాయి. అందుకే తల ఒక్కంటికీ 135 లీటర్లు కాకుండా రోజుకు కేవలం 85 లీటర్ల నీటిని అతికష్టంగా సరఫరా చేస్తున్నారు. పట్టణంలో మూడు రిజర్వాయర్లు, మూడు ఓహెచ్‌ఆర్‌లు, 5 ట్యాంకర్లు ఉన్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీ దాదాపు 15 శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నిత్యం తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కౌన్సిల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు మాత్రం తమ వార్డుకు తాగునీరు అందడం లేదని గగ్గోలు పెడుతున్నారు. పంట కాలువపై రెండు వంతెనల నిర్మాణం, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె కారణాలతో అసలే తాగునీటి వెతలతో ఉన్న పట్టణానికి ఆ కష్టాలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి.

3 హెచ్‌ఆర్‌లు పూర్తయితేనే పూర్తిస్థాయిలో తాగునీరు

ఈనెల 27న నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తాగునీటి ఇబ్బందులపై పలువురి కౌన్సిలర్లు మాట్లాడుతున్నప్పుడు ఇంజినీర్లు ఒకే మాట అన్నారు. రూ. 20 కోట్ల ప్రాజెక్ట్‌లో మూడు ఓహెచ్‌ఆర్‌లు పూర్తయితేనే పట్టణంలోని ప్రజలకు పూర్తిగా తాగునీరు అందివ్వగలమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలోని ప్రాజెక్ట్ అని భేషజాలకు పోకుండా పట్టణ ప్రజల దాహార్తిని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్ట్‌లోని మిగిలిన రెండు భారీ ఓహెచ్‌ఆర్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో చేపలు స్వాహా



నీరు అడుగంటిన బోడసకుర్రు ప్రాజెక్టు చెరువు

అల్లవరం: గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ద్వారా అల్లవరం మండలంలోని 14 గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందిస్తున్న బోడసకుర్రు ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు అడుగంటడంతో కొందరు అందులోని చేపలను పట్టుకుని సొమ్ము చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రధాన కాలువలపై వంతెనల నిర్మాణం చేపట్టడంతో కాలువలకు సాగునీరు రావడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో బోడసకుర్రు ప్రాజెక్టులో నీటి కొరత వచ్చింది. వేసవిలో ఎక్కువ మొత్తంలో నీటిని శుద్ధి చేసి తాగునీరు పంపిణీ చేయడంతో చెరువులో నీరు అడుగంటాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు చెరువులోని చేపలపై కన్నేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సహకారంతో చెరువులో చేపలను రాత్రికి రాత్రే పట్టబడి చేయించి సొమ్ము చేసుకున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో (2014–19) ఉన్నప్పుడు చెరువులోని చేపలను పట్టుకుని అమ్ముకునేందుకు అప్పటి డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో పంచాయతీలో వేలం పాట నిర్వహించారు. వేలంలోని నిబంధనల మేరకు 8 అడుగుల లోతులో చేపలను వేటాడుకోవాలని నిర్ణయించారు. ఆ మేరకే చేపలను వేటాడుకుని విక్రయించారు. అప్పుడు మిగిలిన చేపలు బాగా పెరిగి పెద్దవయ్యాయి. ఇటీవల చెరువులో నీరు తగ్గడంతో చేపలున్నట్టు గుర్తించిన నాయకులు వాటిని పట్టుబడి చేయించి పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు. చెరువులో నీరు తగ్గడం వారి పాలిట వరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈవో లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం



దేవదాయ శాఖ ఈవో లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న జిల్లా అధికారులు, సిబ్బంది

అమలాపురం రూరల్: ఉభయ గోదావరి జిల్లాల్లో 44 ఏళ్లుగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవోగా పలు దేవస్థానాల్లో పనిచేసిన మాచిరాజు లక్ష్మీనారాయణ విశేష సేవలు అందించారని ఆ శాఖకు చెందిన జిల్లా అధికారులు కొనియాడారు. కాకినాడలోని భావనారాయణ దేవస్థానం ఈవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మీనారాయణకు స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన వీడ్కోలు, సత్కార సభలో ఆ శాఖ అధికారులే కాకుండా అభిమానులు హాజరై మాచిరాజు సేవలను కొనియాడారు. వీడ్కోలు సభకు ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో నల్లం చక్రధరరావు, అసిస్టెంట్ కమిషనర్, మురమళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం ఈవో వి.సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. గ్రేడ్ -1 ఈవో లక్ష్మీ నారాయణ సొంతూరు అమలాపురం కావడంతో వీడ్కోలు సభకు పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా మద్ది ఆంజనేయస్వామి, అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, అయినవిల్లి సిద్ధి వినాయక, మురమళ్ల వీరేశ్వరస్వామి, సామర్లకోట చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి, కాకినాడ భావ నారాయణస్వామి దేవస్థానాల ఈవోగా లక్ష్మీనారాయణ పనిచేశారని పేర్కొన్నారు. ఈవో లక్ష్మీనారాయణ కుమార్తె, అల్లుడు శ్వేత, సునీల్‌కుమార్ దంపతులతో పాటు జిల్లాలోని పలు దేవస్థానాల ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. లక్ష్మీనారాయణ, సుబ్బలక్ష్మి దంపతులను జిల్లా దేవదాయ శాఖ ఈవోలు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు గజమాలలతో సత్కరించారు.

అలరించిన 'ఆకెళ్ల' అష్టావధానం



పృచ్ఛకుల నడుమ అష్టావధానం నిర్వహిస్తున్న అవధాని బాల భాను

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల కోనసీమ మహిళా మండలి భవనంలో మహిళా అష్టావధాని డాక్టర్ ఆకెళ్ల బాల భాను ఆదివారం సాయంత్రం నిర్వహించిన అష్టావధానం ఆహుతులను అలరించింది. అష్టావధానంతో పాల్గొన్న ఎనిమిది మంది పృచ్ఛకులు అడిగిన ప్రశ్నకలు అవధాని అలవోకగా బదులిచ్చి చమత్కారం, మమకారం మిళితమై తీరు సభికులను ఆకట్టుకుంది. అంతర్జాతీయ సాహిత్య, సంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ పర్యవేక్షణలో అష్టావధానం రెండు గంటల పాటు ఆసక్తికరంగా సాగింది. అవధానంలో ఆకొండి ధ్వనంతరి అడిగిన సమస్యకు బాల భాను లోతైన సమాధానం ఇచ్చారు. అటు ఛందస్సులోనూ ఇటు వ్యాకరణంలోనూ కఠినంగా ఉన్న సమస్యను అవధాని ఎంతో సులువుగా పద్య రూపంలో హృద్యంగా బదులిచ్చారు. నల్లా నరసింహమూర్తి ఇచ్చిన దత్తపది కవిత నవత, భవిత, యువత పదాలతో కవులు విశిష్టత శ్రీశ్రీ కళా వేదికపై అడిగిన పద్యాన్ని ఎంతో చక్కగా వివరించారు. బీవీవీ సత్యనారాయణ వర్ణన కోనసీమ అందాలపై అడిగిన పద్యాన్ని అవధాని అంతే అందంగా పూరించారు. పోలిశెట్టి అనంతలక్ష్మి అప్రస్తుత ప్రసంగం ఆకట్టుకుంది. గంటా నాదంగా యెండూరి సీత, పురాణ పఠనంగా ఆకొండి పవన్‌కుమార్‌శర్మ, ఆశువుగా తోపెల్ల కృష్ణపద్మిని పృచ్ఛకులుగా వ్యవహరించి అవధానాన్ని రక్తి కట్టించారు. చివరగా అష్టావధాని ఆకెళ్ల బాల భానును శ్రీశ్రీ కళావేదిక తరపున అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణలు ఘనంగా సత్కరించారు. అవధాన సంధాన కర్త శతావధాని జాన దుర్గ మల్లికార్జునరావును కూడా పండిత శాలువాతో సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు అష్టావధానంలో పాల్గొన్న పృచ్ఛకులకు, అష్టావధానికి వేదిక తరపున జ్ఞాపికలు అందజేశారు. కళావేదిక జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ అధ్యక్షతన అష్టావధానం ఆద్యంతం చలోక్తులు, చమత్కారాలు, హాస్య సందర్భాలతో సాగింది.

ఎల్‌ఐసీ ఏజెంట్లు సంస్థ పురోగతికి తోడ్పడాలి



మాట్లాడుతున్న ఎల్‌ఐసీ రాజమహేంద్రవరం డివిజన్ ఏఓఐ యూనియన్ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

అమలాపురం టౌన్: ఎల్‌ఐసీ ఏజెంట్లు సంస్థ పురోగతికి తోడ్పడాలని అమలాపురం బ్రాంచి మేనేజర్ సుధాకరరెడ్డి సూచించారు. అమలాపురం ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయంలో ఆదివారం ఏవోఐ యూనియన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజమహేంద్రవరం డివిజన్ ఎల్‌ఐసీ ఏవోఐ యూనియన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎల్‌ఐసీ ఏజెంట్లకు నష్టం జరిగితే ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఏఐవో) యూనియన్ ద్వారా ప్రతి ఘటిస్తామని అన్నారు. అమలాపురం యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం ఎల్‌ఐసీ ఏజెంట్లకు, అధికారులకు, పాలసీదారులకు మధ్య ఉండాల్సిన సత్ సంబంధాలను చర్చించారు. రాజమహేంద్రవరం డివిజన్ యూనియన్ జనరల్ సెక్రటరీ వి.నాగిరెడ్డి, కోశాధికారి రామకృష్ణ, అంబాజీపేట శాటిలైట్ ఎల్‌ఐసీ బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ మధుబాబు మాట్లాడారు. చివరగా అమలాపురం యూనియన్ కోశాధికారి డీవీ స్వామి యూనియన్ వార్షిక నివేదికను సమావేశంలో సమర్పించారు. అమలాపురం యూనియన్ కార్యదర్శి జి.వినాయకరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పీకే మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జంతువుల ప్రదర్శన



పెంపుడు శునకాల ప్రదర్శన

యానాం: పశుగణాభివృద్ధి, పశుసంక్షేమశాఖ, పుదుచ్చేరి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పశువులు, కోళ్ల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గ్రామాల నుంచి వివిధ రకాల అరుదైన మేలు జాతి ఆవులు, గేదెలు, పెయ్యలు, పౌల్ట్రీ విభాగంలో కోళ్లు, కోడిపుంజులు, గొర్రెలు, మేకలు, పెంపుడు శునకాలు, పిల్లులను ప్రదర్శించారు. పశువైద్యాధికారి డాక్టర్ వి.కొమారిణి మాట్లాడుతూ పశువుల బలం, ఆరోగ్యం, సంరక్షణ, అందంతో పాటు వాటి జాతి లక్షణాలను ప్రదర్శించడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. అనంతరం ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన పశువులు, జంతువులకు బహుమతులను ఆయా యాజమాన్యాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డాక్టర్ చెక్కపల్లి శ్రీరామ్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ రూ.1.28 కోట్ల లాభార్జన



అమలాపురం టౌన్ బ్యాంక్ మహా జన సభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వెంకట సూర్యనారాయణ

అమలాపురం టౌన్: అమలాపురం కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఈ సంవత్సరం మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.91 కోట్ల విలువైన వ్యాపారం చేసి రూ.1.28 కోట్ల లాభార్జనతో ఉందని ఆ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మెట్ల వెంకటసూర్యనారాయణ తెలిపారు. స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన టౌన్ బ్యాంక్ 27వ వార్షిక మహా జన సభలో బ్యాంక్ చైర్మన్ వెంకట సూర్యనారాయణ మాట్లాడారు. బ్యాంక్‌లో రూ.50.97 కోట్ల మేర డిపాజిట్లు ఉన్నాయన్నారు.

రూ.40 కోట్ల రుణాలు

వివిధ రంగాలకు రూ.40 కోట్లు రుణాలుగా అందించామని చెప్పారు. ఈ సంవత్సరం బ్యాంక్ సభ్యులకు 13 శాతం డివిడెంట్లను ప్రకటించామన్నారు. మహా జనసభలో 2024–25 బ్యాంక్ ఆడిట్ నివేదకను మేనేజింగ్ డైరెక్టర్ శిరగం వేణుగోపాలరావు ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. పదో తరగతి పరీక్షల్లో అమలాపురం రెవెన్యూ డివిజన్ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఏడుగురి విద్యార్థులకు బ్యాంక్ చైర్మన్లు, డైరెక్టర్లు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. బ్యాంక్ వైస్ చైర్మన్ ఎండీ అమీర్, డైరెక్టర్లు డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, డాక్టర్ గొలకోటి రంగారావు, మేనేజర్ చిక్కం బాబు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో సత్తెమ్మ తల్లి



శాకంబరి అలంకరణలో సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం: ఆషాఢమాసం సందర్భంగా చెయ్యేరు గున్నేపల్లి సత్తెమ్మ తల్లిని ఆదివారం శాకంబరిగా అలంకరించి పూజలు చేసారు. భోగిశెట్టి తిరుమల పల్లంరాజు, సాధనాల పండు సమకూర్చిన వివిధ రకాలైన పండ్లు, కూరగాయలతో శాకంబరిగా అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గాలిదేవర జగదీష్, గనిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ జాగృతిలో ఆర్‌ఎస్‌ఎస్ కీలకపాత్ర



గురుపూజోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు

యానాం: సమాజాన్ని జాగృతం చేయడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కీలకపాత్ర వహిస్తుందని రిటైర్డ్ ఎస్సై బళ్ల సూర్యలక్ష్మీ నారాయణ (గోపి) పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కామిశెట్టివారి వీధిలో గీతామందిరంలో ఆర్‌ఎస్‌ఎస్ యానాం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏపీ ప్రాంత సేవా ప్రముఖ్ మనోహర్ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థలో పూర్వం నుంచి గురు పరంపర ఉందని ఇప్పటికీ గురువు అడుగుజాడల్లో నడిచే కుటుంబాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యానాం ఖండ కార్యవాహ ఏడిద చంద్రశేఖర్, కొండమూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన మంత్రి ప్రమాణ స్వీకారానికి తొలగిన అడ్డంకులు

యానాం: పుదుచ్చేరి సీఎం రంగసామి నేతృత్వంలో ఎన్‌ఆర్ కాంగ్రెస్, బీజేపీ ఎన్డీయే కూటమి ప్రభుత్వ మంత్రిగా ఎ జాన్‌కుమార్ ప్రమాణ స్వీకారానికి అడ్డంకులు తొలగిపోయాయి. మంత్రిగా జాన్‌కుమార్ పేరును సిఫార్సు చేస్తూ ఆదివారం రాజ్ నివాస్‌లో ఎల్జీ కె.కైలాషనాథన్‌కు సీఎం రంగసామి తెలిపారు. ఈ సమావేశంలో రాజీనామా చేసిన మంత్రి సాయిశరవణన్ స్థానంలో కామరాజ్‌నగర్ నుంచి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే జాన్‌కుమార్‌ను కేబినెట్‌లో తీసుకుంటున్నట్లు సంబంధిత లేఖను అందజేశారు. ఈనెల 2న బుధవారం జాన్‌కుమార్‌తో ఎల్జీ ప్రమాణస్వీకారం చేయించనున్నారని భావిస్తున్నారు. 2021లో నిర్వహించిన ఎన్నికల్లో మైనారిటీ వర్గానికి చెందిన జాన్‌కుమార్ కుమారుడు వివియన్ రిచర్డ్స్ ఇద్దరూ బీజేపీ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. బీజేపీ జాన్‌కుమార్ మంత్రిని చేయడం ద్వారా ఆయన ఇన్నాళ్లు నడిపిన అసమ్మతి వర్గానికి చెక్ పెట్టినట్లు అందరూ భావిస్తున్నారు.

దళిత మంత్రులను బలి చేయడం దారుణం

యానాం: ఎన్ రంగసామి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రివర్గం నుంచి బీజేపీ సాయిశరవణన్‌కుమార్‌ను రాజీనామా చేయించడాన్ని ఖండిస్తున్నట్లు ఆదివారం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, డీఎంకే కన్వీనర్ ఆర్ శివ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే ప్రభుత్వంలో గతేడాది దళిత మంత్రి ఎస్.చంద్రికా ప్రియాంకను అన్యాయంగా తొలగించారన్నారు. మళ్లీ రెండేళ్లకు సాయిశరవణన్‌ను తొలగించారని విమర్శించారు. బీజేపీ, ఎన్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం తమ అధికార కుమ్ములాటలతో దళిత వర్గానికి చెందిన మంత్రులను బలి పశువులను చేస్తోందని సీపీఐ కార్యదర్శి ఏఎమ్ సలీమ్ తీవ్రంగా విమర్శించారు.

25న 'బుద్ధునితో నా ప్రయాణం.. అంబేడ్కర్' నాటక ప్రదర్శన

అమలాపురం రూరల్: బుద్ధునితో నా ప్రయాణం .. అంబేడ్కర్ నాటకాన్ని అమలాపురంలో జులై 25న ప్రదర్శించనున్నట్టు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీబీలోక్ అన్నారు. అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో ఆదివారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా సమావేశం రాంబోధి కాశి అధ్యక్షతన నిర్వహించారు. లోక్ మాట్లాడుతూ బీఎస్ఐలో సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కోలా త్రిమూర్తులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.